క్లుప్తంగా

నేటి నుంచి ఐదు రోజుల పాటు ఆధార్ క్యాంపులు

కృత్తివెన్ను: ఈ నెల 23వ తేదీ మంగళవారం నుంచి 27వ తేదీ శనివారం వరకు ఐదు రోజుల పాటు నిర్దేశించిన సచివాలయాల వద్ద ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు మండల పరిషత్ కార్యాలయం నుంచి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలిముద్రలు పడని వారికి కొత్తగా బయోమెట్రిక్ చేయడం, ఆధార్ కార్డుకు సంబంధించిన మార్పులు, చేర్పులు చేస్తారన్నారు. 23వ తేదీన లక్ష్మీపురం సచివాలయం వద్ద లక్ష్మీపురం, పల్లెపాలెం, మాట్లాం, 24వ తేదీన చినగొల్లపాలెం సచివాలయం వద్ద చినగొల్లపాలెం-1, -2 పడతడిక, 25న గరిశపూడి సచివాలయం వద్ద నిడమర్రు -1, -2, గరిశపూడి, 26న సీతనపల్లి సచివాలయం వద్ద సీతనపల్లి, కృత్తివెన్ను, నీలిపూడి, కొమాళ్లపూడి, 27న చినపాండ్రాక-2 సచివాలయం వద్ద చినపాండ్రాక-1, -2, ఇంతేరు, యండపల్లి సచివాలయ పరిధిలోని గ్రామాల వారికి ఆధార్ క్యాంపులు నిర్వహిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రుణం మొత్తం చెల్లించాలి

చిలకలపూడి(మచిలీపట్నం): ఖాతాదారుడికి రుణం మొత్తం చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీ రాయల సోమవారం తీర్పు చెప్పారు. పెడన మండలం నందమూరు గ్రామానికి చెందిన జోగి నాగేశ్వరరావు మణపురం ఫైనాన్స్ కంపెనీ విజయవాడ వారి వద్ద రుణాన్ని తీసుకుని జీవనోపాధి కోసం 2022 ఆగస్టులో వాహనాన్ని కొనుగోలు చేశారు. వాహనానికి ఇన్సూరెన్స్ నిమిత్తం హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో లోన్ మొత్తానికి ఇన్సూరెన్స్ ప్రీమియం కింద రూ. 22,198 చెల్లించారు. ప్రతినెలా రుణానికి చెందిన ఈఎంఐ రూ. 32,210 మణప్పురం ఫైనాన్స్ కంపెనీ వారికి చెల్లిస్తున్నారు. 2023 జనవరి 14వ తేదీన జోగి నాగేశ్వరరావు గుండెపోటుతో మరణించాడరు. ఈ విషయాన్ని మణప్పురం ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ వారికి తెలియజేసినా ప్రయోజనం లేకుండా పోయింది. మణప్పురం ఫైనాన్స్ వారు వెహికల్‌ను సీజ్ చేశారు. దీంతో భార్య జోగి వెంకట నరసమ్మ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. వివరాలు విచారణ చేసిన అనంతరం కమిషన్ సభ్యులు హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ రుణం మొత్తం అనగా రూ. 11,13,306 మణప్పురం ఫైనాన్స్ వారికి చెల్లించాలని, మణప్పురం ఫైనాన్స్ కంపెనీ వారు సీజ్ చేసిన వాహనాన్ని విడుదల చేసి వినియోగదారుడికి అప్పగించాలని ఆదేశించారు. వినియోగదారుని వాహనం సీజ్ చేయడంతోనష్టం కలిగినందుకు మణప్పురం ఫైనాన్స్ కంపెనీ వినియోగదారునికి లక్ష రూపాయలు పరిహారం, మానసిక వేదనకు కలిగించినందుకు రూ. 50 వేలు చెల్లించాలన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ వారు మానసికవేదన కలిగించినందుకు రూ. 50 వేలు, ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలను ఈ చెల్లింపులన్నీ 30 రోజుల్లోగా ఖాతాదారునికి అందజేయాలని తీర్పు ఇచ్చారు.

పెడన ఘటనలో దోషులను శిక్షించాలని కోరుతూ నిరసన



మచిలీపట్నంటౌన్: పెడన పట్టణంలోని 6వ వార్డులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అగౌరవపరిచిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరుతూ దళిత జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి జేఏసీ జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనందబాబు (జానీ) ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి దోషులను శిక్షించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం నుంచి తాలుకా సీఐ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సీఐ తో చర్చలు జరిపిన అనంతరం పెడన ఘటన బాధ్యులను అరెస్టు చేయటంతో జేఏసీ నాయకులు నిరసన విరమించారు. కార్యక్రమంలో దళిత జేఏసీ మండల అధ్యక్షుడు ఉచ్చుల గణేష్, జేఏసీ యూత్ అధ్యక్షుడు చైతన్య, దళిత జేఏసీ నాయకులు భార్గవ్, మద్దెల పాండురంగారావు, భూపతి అంబేడ్కర్, గుమ్మడి సుబ్బారావు, గోశాల సుబ్బారావు, దమ్ము కేశవరావు, 31వ డివిజన్ కార్పొరేటర్ యంద్రపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్



కోనేరుసెంటర్: జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావును పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా బాధ్యతలు తీసుకున్న ఎస్పీని అభినందిస్తూ స్వీట్లు అందజేశారు. అనంతరం శాంతిభద్రతల అంశంపై చర్చించారు.

రోడ్డు మార్జిన్లలో ఆక్రమణల తొలగింపు

మచిలీపట్నంటౌన్: నగరంలోని బస్టాండ్ సెంటరు నుంచి జిల్లా కోర్టు సెంటరు వరకు ప్రధాన రహదారి మార్జిన్ వెంబడి ఉన్న ఆక్రమిత దుకాణాలను మునిసిపల్ అధికారులు సోమవారం తొలగించే కార్యక్రమం చేపట్టారు. రోడ్డు మార్జిన్‌లో, డ్రెయిన్లపై ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించారు. ఈ సందర్భంగా దుకాణదారులకు, మునిసిపల్ సిబ్బందికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మునిసిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది జేసీబీల సాయంతో ఆక్రమణలను తొలగించటంతో పాటు ఏర్పాటు చేసిన సిమెంటు సప్టాలను తొలగించారు. మరికొంత మంది దుకాణదారులు ఆక్రమణలను స్వచ్ఛందంగానే తొలగిస్తూ వెనక్కి జరిపే పనులు చేపట్టారు. తొలగింపు పనులను కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ మల్లికార్జునరావు, సిబ్బంది పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య దృష్ట్యా పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అందువల్ల రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఆక్రమణల తొలగిస్తున్నామన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో రోడ్డు మార్జిన్లు ఆక్రమించి వ్యాపారాలు చేసే వారు ఆక్రమించిన స్థలాలను స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని సూచించారు. అలా తొలగించకపోతే తామే ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తొలగిస్తామని హెచ్చరించారు.



ఆక్రమణల తొలగింపును పర్యవేక్షిస్తున్న కమిషనర్ బాపిరాజు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ మల్లికార్జునరావు, సిబ్బంది

కౌలు రైతుల గుర్తింపు కార్డుల జారీ వేగవంతం

పెడన: కౌలు రైతుల గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని పెడన తహసీల్దారు ఆర్.రాంబాబు వీఆర్వోలను ఆదేశించారు. మండలంలోని వీఆర్వోలతో సోమవారం సాయంత్రం ఆయన పలు అంశాలపై సమీక్షించారు. మండల వ్యాప్తంగా 3,290 మందికి కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయాల్సి ఉందని, ఇప్పటివరకు 1,501 మందికి మాత్రమే కార్డులు ఇచ్చారన్నారు. మిగిలిన వాటిని కూడా త్వరగా ఇవ్వాలని ఆదేశించారు. నీటి తీరువా పన్నులను త్వరగా వసూలు చేసి ఎప్పటికప్పుడు సంబంధిత ఖాతాకు జమ చేయాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన భవనాలను, పూరి గుడిసెలను గుర్తించి అందులో ఎవరైనా ఉన్నట్లుగా ఉంటే వారిని తక్షణం ఖాళీ చేయించేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్ఐ మణికుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.



వీఆర్వోలతో సమీక్షిస్తున్న తహసీల్దారు రాంబాబు

ఘనంగా మాజీ ఎమ్మెల్యే సింహాద్రి జన్మదిన వేడుకలు

- వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసిన పార్టీ నాయకులు
- ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు ప్రదానం

అవనిగడ్డ: మాజీ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్ బాబు జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, అభిమానులకు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ జయకుమార్‌తో కలసి రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అవనిగడ్డ మండల అధ్యక్షుడు రేపల్లె శ్రీనివాసరావు, రాధా రంగా మిత్ర మండలి దివి యూనిట్ అధ్యక్షుడు రాజనాల మాణిక్యాలరావు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి గాజుల జైగోపాల్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మోపిదేవిలో...

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి ప్రధానసెంటర్‌లో మాజీ శాసన సభ్యుడు సింహాద్రి రమేష్ బాబు జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు(బుల్లి) కేక్‌కట్ చేసి అందరికీ అందజేశారు. కార్యక్రమంలో కోసూరు శివ నాగమల్లేశ్వరరావు, మోర్ల శ్రీనివాసరావు, గండు దుర్గారావు, కేసగాని రాంబాబు, రావి రామ్ ప్రసాద్, కామిశెట్టి వెంకట సురేష్‌బాబు, తుటారం కృష్ణ, పండలనేని శివప్రసాద్, కోసూరు కోటేశ్వరరావు, రెడ్రౌతు వెంకట రమణ, ఉప్పాల కోటేశ్వరరావు, తలుపుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డ వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు



కోడూరులో రమేష్‌బాబు జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న పార్టీ శ్రేణులు

కోడూరులో...

కోడూరు: మాజీ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్ బాబు జన్మదిన వేడుకలను సోమవారం స్థానిక ప్రధాన సెంటర్‌లో వైఎసోస్‌ర్ సీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులు బర్త్‌డే కేక్‌ను కట్ చేసి రమేష్‌బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యన్నారాయణ, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కన్వీనర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యా బోధనకు బోధన సామగ్రి

మచిలీపట్నంటౌన్: మెరుగైన విద్యాబోధనకు, ఫలితాలు సాధించేందుకు బోధన అభ్యాస సామగ్రి ఎంతగానో ఉపయోగపడుతుందని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ అన్నారు. స్థానిక కేంద్రీయ విద్యాలయంలో సోమవారం అభ్యాస సామగ్రి ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ విద్యాలయంలో 40 మంది ఉపాధ్యాయులు వారి సృజనతో విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా బోధనా అభ్యాససామగ్రిని తయారుచేశారన్నారు. వీటి తయారీలో ఉపాధ్యాయుల ప్రతిభ కనపడుతోందన్నారు. బోధన అభ్యాస సామగ్రి ద్వారా విద్యార్థులకు క్లిష్టమైన అంశాలను కూడా సులువుగా అర్థమయ్యేలా చెబుతారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బోధన సామగ్రి ప్రదర్శన తిలకిస్తున్న ప్రిన్సిపాల్ హుస్సేన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు

మర్రిపాలెం గంగానమ్మతల్లికి ఘనంగా శాకంబరి ఉత్సవం

మర్రిపాలెం(నాగాయలంక): ఆషాఢ మాసం పాడ్యమి పురస్కరించుకుని గ్రామం శివారులో కొలువైన శ్రీగంగానమ్మ తల్లికి గ్రామ మహిళల ఆధ్వర్యంలో సోమవారం శాకంబరి మహోత్సవం నిర్వహించారు. సారె సమర్పణ పూజలు ఘనంగా జరిపారు. ఆలయ ధర్మకర్తలు మద్ది నాగేశ్వరరావు, బండ్రెడ్డి లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో బ్రహ్మశ్రీ లంక వెంకట చలపతిరావు బ్రహ్మత్వంలో తొలుత గ్రామంలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి చెట్టుకు సంప్రదాయ పూజలు జరిపారు. అనంతరం సారె పళ్లాలతో ఊరేగింపుతో గంగానమ్మతల్లి ఆలయానికి చేరుకున్నారు. మహిళల సహకారంతో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించారు. గ్రామంలోని మహిళలు అమ్మవారికి చీరలు, పసుపు కుంకుమ, పండ్లు, మిఠాయిలు సమర్పించారు.



గంగానమ్మతల్లికి సమర్పించిన సారె

మాదకద్రవ్యాలతో ప్రాణాలకు ముప్పు

మచిలీపట్నంటౌన్: మాదక ద్రవ్యాలను తీసుకోవటంతో ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని, వాటికి దూరంగా ఉండాలంటూ మహిళలు సోమవారం గళమెత్తారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక కోనేరుసెంటరులో మాదకద్రవ్యాల నిర్మూలన, వాటిని తీసుకోవటం వల్ల కలిగే నష్టాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య వివరించారు. కార్యక్రమంలో నగర కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, ట్రాఫిక్ ఎస్ఐ సత్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ ఎస్.సువర్ణ, ఈవో ఎస్.విజయలక్ష్మి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎల్.మోనిష, మచిలీపట్నం సీడీపీవో కె.గ్లోరి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వెంకటేశ్వరమ్మ, మాలతీదేవి తదితరులు పాల్గొన్నారు.



కోనేరుసెంటర్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు

ముంపు నీటిలోనే వరిచేలు



కృత్తివెన్ను: మండల పరిధిలోని కొన్ని గ్రామాలలో వర్షం ధాటికి నారుమడులు, వెదజల్లిన వరిచేలు నీట మునిగాయి. పెందుర్రు, మునిపెడ గ్రామాలలో జాతీయ రహదారి పక్కన ఉన్న వెదజల్లిన వరిచేలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. ఇదే విధంగా మరో రెండు రోజుల పాటు ఉంటే వరిచేను కుళ్లిపోతుందని రైతులు వాపోతున్నారు.

పారిశుద్ధ్యంపై శ్రద్ధ తీసుకోవాలి...

దాదాపు వారం రోజులపాటు కురిసిన వర్షాల కారణంగా గ్రామాలలో అపరిశుభ్రత నెలకొంది. అధికార యంత్రాగం యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోకపోతే తాగునీటితో పాటు పరిసరాలు కలుషితమై అంటువ్యాధులు విజృంభించే అవకాశాలు ఉన్నాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ఉపాధి పనుల రికార్డులు పంచాయతీల్లోనే నిర్వహించాలి

నాగాయలంక: గ్రామాల్లో చేపట్టే జాతీయ ఉపాధి హామీ పనుల వివరాల రికార్డులు, నివేదికలను సంబంధిత అధికారులు, సిబ్బంది గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనే నిర్వహించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని వక్కపట్లవారిపాలెం సర్పంచ్ అంబటి శ్యామ్‌ప్రసాద్ ఆరోపించారు. ఈమేరకు ఆయన సోమవారం నాగాయలంక ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.అప్పలనరసమ్మ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ టీవీఎన్ ముత్యాలుకు ఫిర్యాదు చేశారు. మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా నిబంధనల ప్రకారం ఒక్క పంచాయతీలోనూ ఎన్ఆర్ఈజీఎస్ రిజిస్టర్‌లను ఆయా కార్యాలయాల్లో నిర్వహించడం లేదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఆయా గ్రామాల పనులకు సంబంధించిన రికార్డులను ఇళ్ల దగ్గర పెట్టుకుని ఇష్టానుసారం నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని ఉపాధి అధికారి, సిబ్బందిని గాడిలో పెట్టే చర్యలు చేపట్టాలని కోరారు.

మంత్రి పార్థసారథికి ఘనస్వాగతం



చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి సోమవారం మచిలీపట్నం విచ్చేశారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆయనకు ఘనస్వాగతం లభించింది. తొలుత పోలీసుల గౌరవవందనం స్వీకరించిన అనంతరం అతిథిగృహంలోకి వెళ్లారు. కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, గృహనిర్మాణసంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవీ సూర్యనారాయణ, సమాచార పౌరసంబంధాలశాఖ జిల్లా అధికారి ఎం.వెంకటేశ్వరప్రసాద్ పూలమొక్క, పుష్పగుచ్ఛాలను అందజేశారు. అనంతరం జనసేన మచిలీపట్నం ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ ఎంవీ బాబాప్రసాద్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొండి కృష్ణ, మాదివాడ రాము స్వాగతం పలికారు. వీరితో పాటు కూటమికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

పామర్రు: ఆయిల్ పామ్ సాగులో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను పొందవచ్చని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఆయిల్ పామ్ సాగుపై గ్రామ స్థాయి ఉద్యాన, వ్యవసాయశాఖ సహాయ సిబ్బందికి, రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తక్కువ కూలీలతో ఎక్కువ ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయవచ్చన్నారు. ప్రకృతి వైపరీత్యాల భయం లేదని, పంట నష్టం ప్రమాదం లేదన్నారు. పండించిన పంటను సులభంగా అమ్ముకునే విధానం ఈ సాగులో ఉందన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే పారదర్శకంగా పామాయిల్ గెలల సేకరణ జరుగుతుందన్నారు. మన దేశంలో జనాభా అవసరాలకు సరిపడా వంట నూనెల డిమాండ్ దృష్ట్యా ఈ పంట దీర్ఘ కాలం లాభాల బాట నడిపిస్తుందన్నారు. ఉద్యాన విభాగం, ఐఐపీఆర్ శాస్త్రవేత్తల తోడ్పాటుతో రైతులకు శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, ఉద్యానశాఖ పీడీ విజయలక్ష్మి, శాస్త్రవేత్త మంజువాణి, జిల్లా మేనేజర్ చంద్రబాబు, శరత్‌బాబు, పామర్రు మండల ఉద్యాన శాఖ అధికారి కీర్తి పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీడీవో బి.మారుతీ శేషమాంబ

ఘంటసాల: ప్రజలకు ఆధార్ సేవలను చేరువ చేసేందుకు ఏర్పాటు చేస్తున్న ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఘంటసాల ఎంపీడీవో బి.మారుతీ శేషమాంబ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సోమవారం మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ వారి ఆదేశాల మేరకు ఘంటసాల మండలంలోని 13 గ్రామ సచివాలయాల్లో ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తారన్నారు. ఘంటసాల పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఏర్పాటు చేసే ఆధార్ క్యాంపులో ఘంటసాల 1, ఘంటసాల 2 సచివాలయాలు, ఘంటసాలపాలెం, మల్లంపల్లి గ్రామ పంచాయతీల పరిధిలోని వారు, 24న చిట్టూర్పు పంచాయతీ వద్ద చిట్టూర్పు, దేవరకోట గ్రామస్తులకు, 25న లంకపల్లి పంచాయతీ వద్ద లంకపల్లి, దాలిపర్రు, పూషడం, యండకుదురు, మల్లాయి చుట్టూరు గ్రామస్తులకు, 26న కొడాలి పంచాయతీ వద్ద కొడాలి, చినకళ్లేపల్లి, వేములపల్లి, తాడేపల్లి, కొత్తపల్లి గ్రామస్తులకు, 27న శ్రీకాకుళం పంచాయతీ వద్ద శ్రీకాకుళం, తెలుగురావుపాలెం, పాపవినాశనం, గోగినేనిపాలెం, అచ్చెంపాలెం గ్రామాలకు చెందిన ప్రజలకు ఆధార్ సేవలు అందిస్తారన్నారు. ఆయా పంచాయతీల వద్ద ఆధార్ క్యాంపులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో ఆదేశించారు.

27 నుంచి స్వామివారి ఆధికృత్తిక పవిత్రోత్సవాలు

మోపిదేవి: రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న కృష్ణాజిల్లా మోపిదేవి శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆషాఢ కృత్తిక పవిత్రోత్సవాలు ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు సోమవారం మాట్లాడుతూ స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా పవిత్రోత్సవాలు, వైదిక కార్యక్రమాలను అనుసరించి భక్తిశ్రద్ధలతో వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామివారి పవిత్రోత్సవాల సమయంలో శాంతి కల్యాణం, రుద్రాభిషేకం తాత్కాలికంగా నిలిపివేస్తారని, ఈనెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలకు స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటలకు పంచహారతులు, నీరాజన మంత్ర పుష్పములు, చతుర్వేద స్వస్తి తీర్థప్రసాద వినియోగం ఉంటుందని తెలిపారు. 30వ తేదీ ఉదయం 7 గంటలకు తీర్థపు బిందె, ధ్వజ స్తంభ పూజ, నందీశ్వర పూజ ఉదయం 9 గంటలకు శ్రీ వల్లీ దేవసేన అమ్మవార్లకు శాకంబరీ అలంకరణ ఉంటుందని చెప్పారు. ఉదయం 10 గంటలకు విఘ్నేశ్వరపూజ, 108 కలశాలతో అష్టోత్తర కలశాభిషేకం, చతుర్వేద పండితులు, 11మంది రుత్వికులచే మహన్యాస పారాయణ, స్వామివారికి పంచామృతములు, వివిధ రకముల పండ్ల రసములతో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్లకు ఏకాదశ రుద్రాభిషేకం, శాకంబరీ అలంకారం ఉంటాయని తెలిపారు. సాయంత్రం 3 గంటలకు లక్ష బిల్వార్చన, పుష్పార్చన, 4 గంటలకు రుద్రహోమం, 5 గంటలకు శాంతి కల్యాణం, 6 గంటలకు మహా నివేదన, సాయంత్రం 6.30 గంటలకు పంచహారతులు, చతుర్వేద స్వస్తి, తీర్థప్రసాద వినియోగం ఉంటుందని చెప్పారు. స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా 30వ తేదీ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకములు, అష్టోత్తర కలశాభిషేకం, లక్ష బిల్వార్చన, శాంతి కల్యాణంలో పాల్గొను భక్తులు రూ.5 వేలు ఈనెల 29వ తేదీ సోమవారం సాయంత్రం లోగా చెల్లించి రశీదు పొందాలని వివరించారు.



మోపిదేవిలో ఉన్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారు

తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు

తహసీల్దార్ ఎస్.బి.విజయలక్ష్మి

ఘంటసాల: ప్రజలకు తక్కువ ధరలకే బియ్యం, పప్పు అందించేందుకు ఏర్పాటు చేసిన షాపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఘంటసాల తహసీల్దార్ ఎస్.బి.విజయలక్ష్మి అన్నారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సుబ్రహ్మణ్యం రిటైల్ దుకాణం వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాన్ని తహసీల్దార్ విజయలక్ష్మి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో కందిపప్పు రూ.181, స్టీమ్డ్ బీపీటీ బియ్యం రూ.55.85, పచ్చి బీపీటీ బియ్యం రూ.52.40 ఉండగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన దుకాణంలో కందిపప్పు రూ.160, స్టీమ్డ్ బీపీటీ/సోనమసూరి బియ్యం రూ.49, పచ్చి బీపీటీ/సోనమసూరి రూ.48కే అందిస్తారన్నారు. ఈ దుకాణాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వో నాగేశ్వరరావు, దుకాణదారులు పాల్గొన్నారు.



తక్కువ ధరల దుకాణాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ విజయలక్ష్మి

పురపాలక దుకాణాల ఎదుట హోటళ్లను తీయించండి

పెడన: మహాత్మగాంధీ కాంప్లెక్స్‌లోని పలు పురపాలక దుకాణాల ఎదుట తోపుడు బండ్ల ద్వారా హోటళ్లను నిర్వహిస్తుండటంతో తమ వ్యాపారాలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, తక్షణం వాటిని తొలగించాలని పురపాలక సంఘ దుకాణదారులు పలువురు సోమవారం మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్యకు అర్జీ సమర్పించారు. మీ కోసం కార్యక్రమంలో భాగంగా కమిషనర్ తన కార్యాలయంలో అర్జీలను స్వీకరించారు. కుళాయి కనెక్షన్ లేకుండా డిమాండ్ నోటీసు ఇవ్వడంపై కె.రజని వినతిపత్రం అందజేశారు. తమ వారికి సంబంధించి డెత్ ధ్రువీకరణ పత్రాల కోసం బి.జయదుర్గ, ఉమ్మిటి షణ్ముఖరావు, పీడీఎం లక్ష్మీ, బీఎల్ పున్నయ్య అర్జీలు అందజేశారు. పారిశుద్ధ్యం బాగుండటం లేదని కారుపర్తి ఆనందరావు అర్జీ సమర్పించారు. ఆయా అర్జీలను పరిష్కరించే నిమిత్తం ప్రజారోగ్య విభాగానికి పంపించి రెండు రోజుల్లో పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసినట్లు కమిషనర్ తెలిపారు.



మున్సిపల్ దుకాణాల ఎదుట హోటళ్ల బండ్లను తొలగించాలని అర్జీ ఇస్తున్న వ్యాపారస్తులు

నారుమడుల్లో సస్యరక్షణ చర్యలు

కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీలత

మోపిదేవి: అకాల వర్షాలతో నారుమడులలో సస్యరక్షణ చర్యలు తప్పక పాటించాలని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత తెలిపారు. మండల కేంద్రం మోపిదేవిలో పంటపొలాలు పరిశీలించిన అనంతరం సచివాలయం వద్ద రైతులతో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పొలం దమ్ము చేయడం మొదలుకుని నారుమడి పెంపకం, నాట్లు వేసుకోవడం వరకు అన్ని పనులు సాగుతున్నాయని తెలిపారు. మెట్ట ప్రాంతాల్లో చాలా చోట్ల బోర్ల సాయంతో నార్లు వేసుకోవడంతో పాటు నాట్లు నాటడం కూడా ముమ్మరంగా జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నారు వేసే పనిలో ఉన్న రైతులు నారు మడుల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఎక్కువ రోజులు కనుక నీరు నిల్వ ఉంటే మొలక దెబ్బతిని, మళ్లీ నారు వేసుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. నీరు తీసివేసిన తరువాత 5 సెంట్లలో వేసిన నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేస్తే, కొత్త ఆకులు వచ్చి నాట్లు వేసుకునేందుకు అనుకూలంగా ఉంటాయని చెప్పారు. ఇప్పటికే నాట్లు వేసిన పొలాలు ముంపునకు గురైతే నీటిని పూర్తిగా తీసివేసిన తరువాత పైపాటుగా ఒక ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ కలిపి చల్లుకోవడం ద్వారా మొక్క ముంపు నీటి ప్రవాహం నుంచి కోలుకుంటుందని తెలిపారు. కుళ్లుతెగులు సోకకుండా ఒక లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం మందు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కేవీకే శాస్త్రవేత్త కె.రేవతి, ఏవో హెప్సిబారాణి పాల్గొన్నారు.



మోపిదేవిలో రైతులతో మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలత